కనిగిరిపై నిధుల వరద

- నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు
- రూ.369.87 కోట్లతో కనిగిరిలో వివిధ అభివృద్ధి పనులు
- అదనంగా రూ.530 కోట్లతో రెండు నీటి పథకం పనుల పురోగతి
- రూ.118 కోట్లతో ఓవీ రోడ్డు పనుల నిర్మాణం
- రూ 430 కోట్లతో ఎన్‌హెచ్(ఓ) రోడ్డు పనులు ప్రారంభం


పునుగోడులో నిర్మించిన సచివాలయ, ఆర్‌బీకే, హెల్త్ క్లినిక్ సెంటర్ భవనాల సముదాయం

కనిగిరి రూరల్: కనిగిరి నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెడుతోంది. గతంలో ఏ ప్రభుత్వాలు కేటాయించనన్నీ నిధులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేశారు. వివిధ అభివృద్ధి పనులకు వందల కోట్ల నిధులు కేటాయించి కనక వర్షం కురిపించారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారు. ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. నియోజకవర్గంలోని ఆరు మండలాలు, పట్టణ మున్సిపాలిటీ, 135 పంచాయతీల్లోని సచివాలయాల్లో 105 సచివాయల పరిధిలో వందల కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టుకున్నాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన తర్వాత నాలుగేళ్ల పాలనలో కనిగిరి నియోజకవర్గం అభివృద్ధిలో దూసుకెళ్తుంది. గ్రామ సచివాలయ వ్యవస్థతో పాటు రోడ్ల అభివృద్ధి, తాగునీటి పథకాలు, జగనన్న కాలనీలు, చెరువుల అభివృద్ధి తదితర పనులు వందల కోట్లతో నిర్మితమయ్యాయి.

నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు ఇలా..

★ ఆరు మండలాల్లో 93 సచివాలయ భవనాలు రూ 36. 60 కోట్లు జరిగాయి.
★ 93 రైతు భరోసా కేంద్రాలను రూ 20. 27కోట్లు చేపట్టారు.
★ 86 హెల్త్ క్లీనిక్ కేంద్రాలను రూ. 15 కోట్లు
★ జీజీఎంపీకి రోడ్ల అభివృద్ధి రూ. 8 కోట్లు
★ చెరువుల అభివృద్ధి, మరమ్మతులకు 64 పనులకు రూ.63 కోట్లు
★ జగనన్న కాలనీల్లోని 6,602 గృహాల్లో నిర్మాణంలో ఉన్న 4,200 గృహాలకు రూ.118 కోట్ల ఖర్చు
★ పంచాయతీరాజ్ శాఖలోని పీఐ(యు) ప్రాజెక్టు కింద 62 తారురోడ్ల అభివృద్ధికి రూ.99 కోట్ల ఖర్చు
★ రూ 61.33 లక్షలతో నియోజకవర్గ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ నిర్మాణం
★ కనిగిరి మున్సిపాలిటీలో వివిధ అభివృద్ధి పనులకు రూ.18 కోట్లు కేటాయింపు

రూ 530 కోట్లతో మంచి నీటి పథకాలు

కనిగిరి ప్రజలకు ఫ్లోరైడ్ సమస్య శాశ్వత పరిష్కారంకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. అందులో భాగంగా ఏఐబీ కింద కనిగిరి పట్టణానికి రూ 130 కోట్లతో సమగ్ర రక్షిత మంచి నీటి పథకం, కనిగిరి ఆరు మండలాల్లోని ప్రజలకు సాగర్ జలాలు అందించేందుకు వాటర్ గ్రిడ్ పథకం కింద రూ 400 కోట్ల స్కీంను మంజూరు చేశారు. పనులు పురోగతిలో ఉన్నాయి.

రూ.100.27 కోట్లతో ఓవీ రోడ్డు నిర్మాణ పనులు

- రూ 100.27 కోట్లతో ఊళ్ల పాలెం నుంచి వేములపాడు వరకు డబుల్ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. న్యూ డవలప్‌మెంట్ బ్యాంక్ (ఎన్‌డీపీ) కింద సుమారు 55 కి.మీ దూరం రోడ్డు పనులు జరుగుతున్నాయి.
- రూ.18 కోట్లతో (సీఆర్ఎఫ్ గ్రాంట్)సెంట్రల్ రోడ్ ఫండ్ కింద సింగరాయకొండ నుంచి కనిగిరి వరకు వివిధ ప్రాంతాల్లో సుమారు 18 కి.మీల దూరం ఉన్న రోడ్లు అభివృద్ధి జరుగుతున్నాయి.
- కనిగిరి, పీసీపల్లి మండలాల్లోని శతాబ్దాల కాలం నాటి రెండు మట్టి రోడ్లను తారు రోడ్లుగా మార్చుతూ నిధులు మంజూరు చేశారు.
- కనిగిరి నుంచి కలగట్ల రోడ్డు రూ.11 కోట్లతో, లింగన్నపాలెం నుంచి మాలకొండ రోడ్డు రూ.5 కోట్లతో త్వరలో అభివృద్ధి జరగనున్నాయి.
- సీఎస్‌పురం నుంచి మాలకొండ వరకు సుమారు 62 కి.మీల దూరం ఉన్న రోడ్డును రూ 430 కోట్లతో ఎన్‌హెచ్(ఓ)లో నిర్మిస్తున్నారు.


నిర్మాణంలో ఉన్న ఓవీ రోడ్డు పనులు


రూ 400 కోట్ల మంచి నీటి పథకం పనుల సర్వేచేస్తున్న అధికారులు


అగ్రి టెస్టింగ్ ల్యాబ్ భవనం

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పరిపాలన



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లుగా పరిపాలన సాగుతోంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో, ఆశీస్సులతో నియోజకవర్గంలో సుమారు రూ.400 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేశాం. రూ.530 కోట్లతో మంచినీటి పథకం పనులు పురోగతిలో ఉన్నాయి. రూ.118 కోట్లతో ఓవీ రోడ్డు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. మరో రూ.430 కోట్లతో 62 కి.మీల రోడ్ల అభివృద్ధి పనులు జరగనున్నాయి.

– బుర్రామధుసూదన్ యాదవ్, కనిగిరి ఎమ్మెల్యే

మా ఒక్క పంచాయతీలోనే రూ.12 కోట్ల అభివృద్ధి పనులు



మాది కనిగిరి మండలం పునుగోడు పంచాయతీ. మా ఒక్క పంచాయతిలోనే వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.12 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఖర్చు చేశాం. గత ప్రభుత్వంలో కనీస అభివృద్ధి జరగలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక రోడ్లు, చెరువుల అభివృద్ధి, కాలువల అభివృద్ధి, సచివాలయ భవనాలు ఇలా అనేక అభివృద్ధి కార్యక్రమాలకు రూ 7.36 కోట్లు ఖర్చు చేశాం. సంక్షేమ పథకాల కింద సుమారు రూ.5.50 కోట్లు పంచాయతి ప్రజలకు లబ్ధి చేకూరింది.

– ఎల్ తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ, పునుగోడు, కనిగిరి మండలం

క్లుప్తంగా

వైభవంగా పోలేరమ్మ నెల కొలుపులు


అమ్మవారి గ్రామోత్సవానికి సిద్ధం చేసిన వాహనం

టంగుటూరు: టంగుటూరు గ్రామంలో పోలేరమ్మ కొలుపులు ముగిసి నెల రోజులు అయిన సందర్భంగా సోమవారం రాత్రి వైభవంగా నెల కొలుపులు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకాలు, విశేష పూజలు చేశారు. రాత్రికి ఏడు ఎడ్ల బండ్లు కట్టి మేళ తాళాల నడుమ అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు.

ఆగస్టు 21 వరకు ఓటరు జాబితాల్లో తప్పల సవరణ


మాట్లాడుతున్న ఈఆర్‌ఓ నారదముని

కొండపి: ఈ నెల 21 నుంచి ఆగస్టు 21వ తేదీ వరకు ఓటరు జాబితాల్లో తప్పుల సవరణకు అవకాశముందని ఈఆర్‌ఓ బి.నారదముని పేర్కొన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ రాజకీయ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఈఆర్‌ఓ మాట్లాడుతూ.. ఈ నెల 21 నుంచి బీఎల్‌ఓలు ప్రతి ఇంటినీ సర్వే చేసి ఓటరు జాబితాలో తప్పులు ఉంటే సవరించాలని చెప్పారు. సమావేశంలో ఆరు మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష


మాట్లాడుతున్న ఎంపీడీఓ సుకుమార్

వెలిగండ్ల: సమస్యలు పరిష్కరించేందుకే ప్రభుత్వం జగనన్న సురక్ష ప్రవేశపెట్టిందని ఎంపీడీఓ టి. సుకుమార్ అన్నారు. మండలంలోని కొట్టాలపల్లి, మరపగుంట్ల గ్రామ సచివాలయాలను ఎంపీడీఓ సుకుమార్ మంగళవారం పరిశీలించారు. ఈ ఆయన మాట్లాడుతూ అర్హులకు ఉచితంగా సర్టిఫికెట్లు అందజేస్తున్నామన్నారు. బుధవారం కొట్టాలపల్లి, మరపగుంట్ల సచివాలయాల్లో సభలు జరుగుతాయని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బన్నీ నియామకంపై హర్షం

పామూరు: పీడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా కనిగిరికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వైఎం.ప్రసాదరెడ్డి(బన్ని) నియమితులు కావడంపై కనిగిరి ఏఎంసీ మాజీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి అంబటి కొండారెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ అంబటి వెంకట సుబ్బమ్మ పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ఆహారంలో నాణ్యత పాటించాలి


అంగాన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ

టంగుటూరు: పిల్లలకు అందించే గుడ్లు, ఆహారంలో నాణ్యత పాటించాలని ఎంపీపీ పటాపంజుల కోటేశ్వరమ్మ సూచించారు. టంగుటూరులోని రైల్వే గేటు వద్ద అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె మంగళవారం పరిశీలించారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని చెప్పారు.

కుమారుడు కనిపించడం లేదని ఫిర్యాదు


శశిధర్ (ఫైల్)

గుడ్లూరు: కాలేజీకి అని వెళ్లిన కుమారుడు రెండు రోజుల నుంచి కనిపించడం లేదని సాధినేని సురేష్ అనే యువకుడు మంగళవారం రాత్రి గుడ్లూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే..సురేష్ కుమారుడు శశిధర్ నెల్లూరు నారాయణ కాలేజీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు సెలవులకు గుడ్లూరు వచ్చిన శశిధర్ సోమవారం ఉదయం కాలేజీ వెళుతున్నానని ఇంటి వద్ద నుంచి బయలుదేరి వెళ్లాడు. సోమవారం సాయంత్రం కళాశాల యాజమాన్యం కాలేజీకి రాలేదని తెలిపారు. బంధువుల వద్దకు వెళ్లి వెతికినా ఉపయోగం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న ఏడీలు, ఎంపీపీ, జెడ్పీటీసీ

పామూరు: మండలంలోని మోపాడు బంగ్లా వద్ద నూతనంగా నిర్మించనున్న విద్యుత్ సబ్‌స్టేషన్‌కు మంగళవారం విద్యుత్‌శాఖ ఒంగోలు కన్‌స్ట్రక్షన్ ఏడీ లక్ష్మీనారాయణ, స్థానిక ఏడీ టి.శ్రీకాంత్, ఎంపీపీ గంగసాని లక్ష్మి, జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య స్థానిక నాయకులతో కలిసి స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓవర్‌లోడ్ సమస్యను అధిగమించి వ్యవసాయానికి, గృహాలకు, వ్యాపార సముదాయాలకు మెరుగైన విద్యుత్‌సేవలు అందించేందుకు మోపాడుబంగ్లావద్ద నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన చేసినట్లు తెలిపారు. ఇక్కడ ఏర్పాటు చేయనున్న 33/11 కేవీ సామర్థ్యం ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ సుమారు రు.4 కోట్ల నిర్మాణ వ్యయం కానుందన్నారు. త్వరలో నిర్మాణ పనులు ప్రారంభించి త్వరితగతిన పనులు పూర్తిచేస్తామన్నారు.

వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి, కోఆప్షన్ నాయబ్‌రసూల్, విద్యుత్‌శాఖ ఏఈ షేక్.జిలానీ, చప్పిడి అజయ్, జొన్నలగడ్డ గోవిందయ్య, బంగ్లా వాసులు, ఎనర్జీ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

అధికారులు జవాబుదారీతనంగా పనిచేయాలి


సచివాలయ రిజిస్టర్‌ను తనిఖీ చేస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: సచివాలయ సిబ్బంది జవాబుదారీతనంగా పనిచేయాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని 12వ వార్డు సచివాలయాన్ని మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించినట్లు తెలిపారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా సచివాలయ ఉద్యోగులు అంకిత భావంతో పనిచేయాలన్నారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తగిన చర్యలు ఉంటాయన్నారు. సచివాలయ ఉద్యోగుల రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. నాయకులు పసుపులేటి అరుణోదర్, తదితరులు పాల్గొన్నారు.

ఎవరికి వారే యమునా తీరే..

- లోకేష్ సభకు వర్గాలుగా చీలిన తెలుగు తమ్ముళ్లు

కొండపి: పొన్నలూరు మండలం అగ్రహారంలో నారా లోకేష్ నిర్వహించిన యువగళం పాదయాత్ర బహిరంగ సభకు తెలుగు తమ్ముళ్లు కొన్ని గ్రామాల్లో రెండువర్గాలు చీలి ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా వివిధ వాహనాల్లో తరలివెళ్లారు. ప్రధానంగా నియోజకవర్గ కేంద్రమైన కొండపిలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు బి. సోమయ్య, మాజీ ఎంపీపీ దేపూరి రత్తమ్మ భర్త సుబ్బారావు ఒక వర్గంగా, ఎస్ సుబ్బరామయ్య, టీడీపీ యూత్ మండల అధ్యక్షుడు ఎస్‌కే కాలేషా ఒక వర్గంగా బయలుదేరివెళ్లారు. గత కొన్ని నెలలుగా రెండు గ్రూపులు ఒకరిపై ఒకరు భౌతిక దాడులకు సైతం పాల్పడుతున్నారు. అదే విధంగా ఇలవరలో ఏకంగా టీడీపీ మండల అధ్యక్షుడు బొద్దపాటి యల్లమందనాయుడు ఫొటో లేకుండా గ్రామ టీడీపీ నాయకుడు జి.పున్నయ్య ఆధ్వర్యంలో ఫ్లెక్సీలు వేశారు. అనంతరం పున్నయ్య వర్గం ప్రత్యేకంగా వాహనాల్లో లోకేష్ సభకు వెళ్లటం మండల టీడీపీలో చర్చనీయాంశమైంది. అదే విధంగా చోడవరంలో సైతం టీడీపీ నాయకుడు కె.రాఘవ, మరో టీడీపీ నాయకుడు ఆర్ బాలక్రిష్ణలు రెండు వర్గాలుగా చీలి ఎవరిదారిన వారు లోకేష్ సభకు చేరుకున్నారు.

26లోగా ఎరువులకు దరఖాస్తు చేసుకోవాలి


టంగుటూరులో వేలంలో పాల్గొన్న వ్యాపారులు

టంగుటూరు: ఎవులు, ఇతర ఉపకరణాలు అవసరమైన రైతులు ఈ నెల 26వ తేదీలోగా పొగాకు బోర్డు కార్యాలయంలో పేరు నమోదు చేసుకోవాలని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు సూచించారు. పొగాకు నాటే ముందు పచ్చిరొట్ట విత్తనాలు చల్లి పంటను కలియదున్నితే నాణ్యమైన పొగాకు పొందవచ్చని చెప్పారు. కాగా స్థానిక పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం ఆలకూరపాడు, రావివారిపాలెం, అనంతవరం, పొలేటిపాడు గ్రామాల రైతులు 999 బేళ్లు తీసుకురాగా 934 కొనుగోలయ్యాయి. గరిష్ట ధర రూ.246, కనిష్ట ధర రూ.165, సరాసరి ధర రూ.230.72 పలికింది. వేలంలో మొత్తం 36 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

రెండు బైకులు ఢీ

గుడ్లూరు: రెండు బైకులు ఎదురెదురుగా ఢీ కొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన గుడ్లూరు-పూరేటిపల్లి ప్రధాన రహదారిలో బసిరెడ్డిపాలెం మిల్లు వద్ద మంగళవారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. పూరేటిపల్లి గ్రామానికి చెందిన ఎరుకలయ్య అనే వ్యక్తి తన బైకుపై చెంచిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన మాల్యాద్రిరెడ్డి అనే వ్యక్తితో కలసి పూరేటిపల్లికి వెళుతుండగా బసిరెడ్డిపాలెం మిల్లు వద్దకు వచ్చేసరికి దప్పళంపాడు గ్రామానికి చెందిన జడ అనీల్ అనే యువకుడు తన బైకుపై గుడ్లూరు వస్తుండగా రెండు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో ముగ్గురు రోడ్డుపై పడ్డారు. ఎరుకలయ్య, అనీల్‌కు తీవ్రగాయాలు కావడంతో 108లో కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. అక్కడనుండి మెరుగైన వైద్యం కోసం ఒంగోలు కు తరలించారు.

ఏసీ, ఫ్రిజ్ రిపేర్‌లో ఉచిత శిక్షణ

టంగుటూరు: గ్రామీణాభివృద్ధి, స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఏసీ, ఫ్రిజ్ రిపేర్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి మంగవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలు భాగ్యనగర్‌లో ఆగస్టు 3వ తేదీ నుంచి నెల రోజులపాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ కాలంలో భోజనం, వసతి పూర్తిగా ఉచితమని, ప్రకాశం జిల్లాకు చెందిన 19 నుంచి 45 ఏళ్ల లోపు మహిళలు మాత్రమే అర్హులని స్పష్టం చేశారు. వివరాలకు 9573363141ను సంప్రదించాలని సూచించారు.

ట్రిపుల్ ఐటీకి నలుగురు విద్యార్థులు ఎంపిక


ట్రిపుల్ ఐటీ సీట్లు పొందిన విద్యార్థులు

టంగుటూరు: మండలంలోని మర్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. ఎస్‌కే మనీషా బేగం, ఎన్.బాలతనూజ, వై.నీరజ్ కుమార్, ఎం.చంద్రికను ప్రధానోపాధ్యాయుడు ఆదినారాయణ, ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

పామూరు: పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి నగదు, సెల్‌ఫోన్లు, బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. కనిగిరి సెబ్ సీఐ షేక్.అబ్దుల్ జలీల్ తెలిపిన వివరాల ప్రకారం..చిలంకూరు గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు సెబ్ ఎస్సై కె.వెంకటేశ్వరరావు, సిబ్బంది నాగేశ్వరావులు దాడులు చేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోనికి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.15,300 నగదు, 8 బైక్‌లు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ అబ్దుల్ జలీల్ తెలిపారు. దాడుల్లో సిబ్బంది శ్యామ్, అబ్దుల్ పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన

గుడ్లూరు: తన భర్తను హత్య చేసి రెండు నెలలవుతున్నా, కేసు విషయంలో పూర్తిస్థాయి న్యాయం జరగలేదని స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట మంగళవారం ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని పాజర్లలో 2 నెలల క్రితం పాటి హనుమంతరావు, మహేష్ అనే ఇద్దరు ఊరి సమీపంలోని జామాయిల్ తోటలో మద్యం సేవించి ఘర్షణ పడ్డారు. ఆ ఘర్షణలో మహేష్ హనుమంతరావును బండరాయితో కొట్టడంతో మృతి చెందాడు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు అయితే నిందితుడిని తప్పించేందుకు పోలీసులు ప్రయతిస్తున్నారని, తన భర్త హత్య కేసులో మరి కొందరి ప్రమేయం ఉందని భార్య నాగమ్మ, తన ముగ్గురు కుమార్తెలు, బంధువులతో కలిసి పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగింది. సమాచారం అందుకున్న సీఐ సుబ్బారావు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని బాధిత మహిళ నాగమ్మతో మాట్లాడి పూర్తిస్థాయిలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

పాఠశాల తనిఖీ


ఆత్మకూరు పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈఓ

ఉలవపాడు: మండల పరిధిలోని ఆత్మకూరు హెచ్‌పీ పాఠశాలను ఎంఈఓ 1 ప్రసాదరావు మంగళవారం తనిఖీ చేశారు. పాఠశాలలోని రికార్డులు పరిశీలించారు. ఉపాధ్యాయులు చెబుతున్న విద్యా బోధనను విన్నారు. ఆసక్తితో పాఠాలు వినాలని విద్యార్థులకు తెలియచేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందచేస్తున్న రాగిజావ నాణ్యతను పరిశీలించారు.

విద్యార్థులకు డిజిటల్ విద్యా బోధన సులభతరం

- కోర్సు డైరెక్టర్ రాజాల కొండారెడ్డి



మాట్లాడుతున్న కోర్సు డైరెక్టర్ రాజాల కొండారెడ్డి

కనిగిరి రూరల్: డిజిటల్ పరికరాలతో విద్యా బోధన ఎంతో సులభతరమని కోర్సు డైరెక్టర్ రాజాల కొండారెడ్డి అన్నారు. స్థానిక ఏబీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో గత పదిహేను రోజులుగా జరుగుతున్న ఆరుమండలాలల ఉపాధ్యాయుల శిక్షణ తరగతులు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా రాజాల కొండారెడ్డి మాట్లాడుతూ ఆధునాతన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్(ఐఎఫ్‌పీ)ల వాడకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన జరగనున్నట్లు తెలిపారు. ఏబీఆర్ విద్యాసంస్థల చైర్మన్ ఆవుల బసిరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ప్రభుత్వం అందిస్తున్న సాంకేతిక శిక్షణ ఎంతో దోహదపడుతుందన్నారు. ఉపాధ్యాయుల శిక్షణ తరగతుల నిర్వాహణకు తమ వంతు సహకారం పూర్తిగా అందచేస్తామని తెలిపారు. రిసోర్స్‌పర్సన్‌లు, సాంబశివప్రసాద్, భాస్కర్, నారాయణ, బ్రహ్మ నందరెడ్డి, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో ఎన్నో అనర్థాలు


మాట్లాడుతున్న ఎస్‌బీసీసీ సెల్ జిల్లా కో ఆర్డినేటర్ కిరణ్‌కుమార్

హనుమంతునిపాడు: బాల్య వివాహాలతో ఎన్నో అనర్థాలు ఉన్నాయని ఎస్‌బీసీసీ సెల్ జిల్లా కో ఆర్డినేటర్ కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని వేములపాడు సచివాలయ పరిధిలోని మహమ్మదాపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం గ్రామ సచివాలయ బాల్యవివాహాల నిరోధక కమిటీ సహకారంతో మండల న్యాయసేవాధికార సంస్థ, జిల్లా ఎస్‌బీసీసీ సెల్, గుడ్‌హెల్ప్ ఫౌండేషన్ సంయుక్తంగా విద్య, ఆరోగ్యం, బాలికా వికాసం, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, బాల్యవివాహాల నిషేధ చట్టం 2006, బాలకార్మిక నిషేధ చట్టం, ఫోక్సో యాక్ట్ 2012పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం కె.నాగమణి, మహిళాపోలీస్ బాలరంగమ్మ, ఏఎన్‌ఎం కృష్ణకుమారి, వెల్ఫేర్ అసిస్టెంట్ రాజ్యలక్ష్మి, ఎస్‌బీసీసీ సెల్ జిల్లా సభ్యులు, పారాలీగల్ వలంటీర్ గుడ్‌హెల్ప్ రమేష్‌బాబు, బీటీఏ నాయకులు దద్దాల శ్రీనివాసరావు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి


అవగాహన కల్పిస్తున్న ఎస్సై ఖాదర్‌బాషా

టంగుటూరు: వాహనదారులు రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఖాదర్‌బాషా సూచించారు. స్థానిక టోల్ ప్లాజా వద్ద మంగళవారం రోడ్డు భద్రతపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ.. రోడ్డు నిబంధనలు పాటించినప్పుడే ప్రమాదాలు నివారించవచ్చన్నారు. హెల్మెట్, సీటుబెల్టు ధరించకుండా, అతివేగంగా వాహనాలు నడపడం వల్ల ఎక్కువ మంది ప్రమాదాల బారిన పడి మృతి చెందుతున్నారని తెలిపారు. అనంతరం వాహనాలకు రేడియం స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.